## వరద సహాయక చర్యలను పర్యవేక్షించిన



2



2

## వైద్యుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## తెయూ పరిధిలో పరీక్షలు వాయిదా



**అక్షరటుడే, డిచ్ పల్లి:** భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల 29, 30వ తేదీల్లో జరిగే పీజీ/బీఎడ్/ఎం ఎడ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కే సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వాయిదా పడిన పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. విద్యార్థులు గమనించాలని సూచించారు.





నీట మునిగిన కామారెడ్డి

# జలవిలయం..

- ఉమ్మడి జిల్లాను ముంచెత్తిన వర్షం
- కుండపోత వానతో కామారెడ్డి అతలాకుతలం
- రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదు
- నిజామాబాద్‌లోనూ దంచికొట్టిన వాన
- ఉప్పొంగుతున్న నదులు, వాగులు
- నిజాంసాగర్, శ్రీరాంసాగర్‌లకు పోటెత్తిన వరద
- పలుచోట్ల తెగిన రోడ్లు, నిలిచిన రాకపోకలు

**కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలను కుండపోత వర్షా లు ముంచెత్తాయి. భారీ నుంచి అతి భారీ వర్షా లు కురవడంతో జల విలయం ఏర్పడింది. కుంభవృష్టితో కామారెడ్డి జిల్లా అతలాకుతలం అవుతోంది. ఎన్నడూ ఎరుగని రీతిలో రికార్డుస్థాయిలో వర్ష పాతం నమోదైంది. కామారెడ్డి పట్టణంలో జలదిగ్బంధంలో చిక్కుకుంది. అలాగే జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల రోడ్లు తెగిపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వరదలతో నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డిలో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఇక నిజామాబాద్ జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల చెరువు కట్టలు తెగిపోయాయి.**

**- అక్షరటుడే, కామారెడ్డి/ఇందూరు**

భారీ వర్షాల నేపథ్యంలో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. ఎక్కడికక్కడ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ఎడ్లకట్ట వాగు పొంగి పొర్లడంతో ఒకవైపు రోడ్డు తెగిపోయింది. దీంతో బుధవారం రాత్రి వరకు జాతీయ రహదారిని మూసివేసిన అధికారులు రాత్రి నీటిని మళ్లించి ఒకవైపు రాకపోకలను క్లియర్ చేశారు. పాల్వంచ వద్ద వాగు ప్రవాహం రోడ్డు పైనుంచి రావడంతో రహదారి దెబ్బతింది. బ్రిడ్జి పరిస్థితిపై ఆందోళన నెలకొనడంతో రాకపోకలను నిలిపివేశారు. దాంతో కామారెడ్డి -సిరిసిల్ల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు లింగంపేట మండలం కొట్టాల్ వద్ద రోడ్డు తెగిపోవడంతో కామారెడ్డి - ఎల్లారెడ్డి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆవుల కోసం వెళ్లి పాల్వంచ వాగులో చిక్కుకున్న తండ్రి కొడుకులను ఎన్డీఆర్ఎఫ్ బృందం, పోలీసులు రక్షించారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి దేవి విహార్ మొదటి గేటు వద్ద వరద ప్రవాహం పెరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



ఆర్మూర్‌లో ఇంటిపై పడ్డ బండరాయి

### రైళ్ల మళ్లింపు

వరద ప్రవాహం కారణంగా రైళ్లను మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భిక్కనూరు మండలం రామేశ్వర్ పల్లి - తిప్పాపూర్ మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతిన్నది. దాంతో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. అయితే రైళ్ల రాకపోకలపై సౌత్ సెంట్రల్ రైల్వే కీలక ప్రకటన చేసింది. మహారాష్ట్ర, కాచిగూడ, కాజీపేట, పెద్దపల్లి వైపు వెళ్లే రైళ్లను నిజామాబాద్ మీదుగా మళ్లిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

### రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

కామారెడ్డిలో వరదల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాయి. బుధవారం రాత్రి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కామారెడ్డికి చేరుకున్నాయి. చిన్నమల్లారెడ్డి చెరువులో చిక్కుకున్న ముగ్గురిని బుధవారం అర్ధరాత్రి రక్షించారు. అలాగే కామారెడ్డి జీఆర్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్‌లో చిక్కుకున్న వికలాంగులురాలితో పాటు మరొక ఇద్దరిని రక్షించారు.

### రాత్రంతా వర్షంలోనే ఉన్నతాధికారులు

కామారెడ్డి నియోజకవర్గంలో భారీ వర్షం నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఎక్కడికక్కడ సహాయక చర్యలు ప్రారంభించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య రాత్రంతా వర్షంలోనే పర్యటించారు. వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ అధికారులను ఎప్పటికప్పుడు అలర్ట్ చేశారు. వరద ప్రాంతాల బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.



కొండూరు శివారులో కొట్టుకుపోయిన వంతెన

## కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే



**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. జిల్లాలోని కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డిలలో వర్షం బీభత్సం సృష్టించింది. రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి మానిటరింగ్ చేశారు. వర్షం ధాటికి చాలా చోట్ల చెరువులు తెగిపోయాయి. అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. దీంతో అధికార యంత్రాంగం స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. పలుచోట్ల వరదల్లో చిక్కుకున్న బాధితులను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ బృందాలు రక్షించాయి. రాష్ట్రంలో మెదక్, కామారెడ్డి జిల్లాలో వరద కారణంగా అపారమైన నష్టం వాటిల్లింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యక్షంగా ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు ఏరియల్ సర్వే నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరారు. మెదక్‌తో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి, నిజాంసాగర్‌లో ముంపు ప్రాంతాలను హెలీకాప్టర్ నుంచే వీక్షించారు. అలాగే పోచారం, నిజాంసాగర్ ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం మెదక్‌కు వెళ్లారు.

## వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** భారీవర్షాల నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ఆదేశించారు. గురువారం టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్‌తో కలిసి జీజీహెచ్‌ను సందర్శించారు. జీజీహెచ్‌లో ఉన్న అత్యవసర వైద్యసేవల సదుపాయాల గురించి ఆరా తీశారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి మండల స్థాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రస్థాయిలో గ్రామాల వారీగా ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాలు ప్రతిరోజూ నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య శిబిరాల నివేదికలు రోజు వారీగా ఉన్నతాధికారులకు సమర్పించాలన్నారు.



## వరద బాధితులకు అండగా నిలుస్తాం


**అక్షరటుడే, కామారెడ్డి:** వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతెలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తో కలిసి గురువారం కామారెడ్డి హౌసింగ్ బోర్డు, జీఆర్ కాలనీల్లో పర్యటించారు. హౌసింగ్ బోర్డు వద్ద వరద ధాటికి దెబ్బతిన్న బ్రిడ్జిని స్వయంగా పరిశీలించారు. అనంతరం జీఆర్ కాలనీ లో ముంపునకు గురైన ఇళ్లలో బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. కాలనీలోకి వస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలకు షబ్బీర్ అలీ ఫౌండేషన్ ద్వారా పండ్లు, ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇంతటి విపత్తు జరగడం బాధాకరమన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో అర్ధరాత్రి మొదలైన వర్షం తెల్లారేసరికి బీభత్సం సృష్టించడం ఊహించని పరిణామమని తెలిపారు. వరద ధాటికి ఒక డాక్టర్, మరొక ఇద్దరు చనిపోయినట్టుగా తెలిసిందన్నారు. వారి కుటుంబాలను ఆదుకుంటామని సీఎం చెప్పారన్నారు. వరద ఉధృతి తీవ్రంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. వరదలపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు చేపడుతుందన్నారు. ఆస్తినష్టం బాగానే ఉన్నట్టుగా తెలుస్తోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. అధికారులతో సమీక్ష చేపట్టి సహాయక చర్యలను ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ఆస్తినష్టం వివరాలను అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. మంత్రి వెంట ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర ఇతర అధికారులు ఉన్నారు.

## భారీ వర్షా లపై ఎంపీ అర్వింద్ ఆరా..

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో బుధవారం నుంచి ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లా వర్షాలపై అధికారులను ఆరా తీశారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్ష ప్రభావం తీవ్రంగా ఉన్నదని.. పలు గ్రామాలు నీట మునిగిపోయిన విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినాయక చవితి పండుగ సెలవు రోజు అయినప్పటికీ అధికారులు బాధ్యతతో పనిచేశారని, రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలర్ట్ ఉన్నందున ఇదే స్ఫూర్తితో బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి కనీస సౌకర్యాలు అందించాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే అధికారులు ఆస్తి, పంటనష్టంపై వివరాలు సేకరించి నష్టపరిహారంపై ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. పార్లమెంటు పరిధిలో నష్టపరిహారంపై తాను కూడా ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని, విపత్తు నిర్వహణపై హోం శాఖకి సైతం నివేదిస్తానని ఎంపీ తెలిపారు. ప్రజలు కూడా అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలని, అధికారులకు సహకరించాలని కోరారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు 39 గేట్లు ఎత్తినందున పరివాహక ప్రాంత ప్రజలు, పశువుల కాపరులు గోదావరి పరిసర ప్రాంతానికి వెళ్లకుండా ఉండాలన్నారు. వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. రానున్న రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. కలెక్టరేట్ లో పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి గురువారం పరిస్థితులను సమీక్షించారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడెక్కడ చెరువులు, కుంటలు, వాగులు తెగిపోయాయి, ముంపునకు గురైన నివాస ప్రాంతాలు, దెబ్బతిన్న రోడ్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, కొట్టుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు తదితర వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రమాదం పొంచి ఉన్న గ్రామాలు, తండాల ప్రజలను పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన గ్రామాల్లో తక్షణమే పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి రావొద్దని కలెక్టర్ సూచించారు.


కామారెడ్డిలో పరిశీలిస్తున్నపోలీసులు


జాతీయ రహదారి 44పై..


నిజామాబాద్ కలెక్టరేట్‌లో..


గాంధారిలో..

# జలవిలయం..

**మొదటిపేజీ తరువాయి:** వరద ప్రాంతాల్లో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పర్యటించారు. అధికారులకు సూచనలు అందిస్తూ రక్షణ చర్యల్లో పాల్గొన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి రాజీవ్ గాంధీ హన్మంతు రక్షణ చర్యల్లో పాల్గొని పరిస్థితిని సమీక్షించారు. కామారెడ్డి ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో నీటి ఉధృతిలో చిక్కుకున్న సుమారు 300 మంది విద్యార్థులను పోలీసులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దోమకొండ మండలం సంగమేశ్వర్ వాగు ప్రవాహంలో కారుతో పాటు కొట్టుకుపోయిన ఇద్దరు 9 గంటల తర్వాత సురక్షితంగా బయటపడ్డారు. వరద ప్రాంతాల బాధితుల కోసం కామారెడ్డి పట్టణంతో పాటు నాగిరెడ్డిపేట, మద్నూర్ ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

## గ్రామాల్లో ఇబ్బందులు..

భారీ వర్షానికి నిజామాబాద్ జిల్లాల్లో పలు గ్రామాల్లో చెరువులకు గండి పడడంతో ఇళ్లకు నీళ్లు చేరాయి. ఇందల్వాయి మండలం సిర్నాపల్లిగ్రామంలో రామన్న చెరువు తెగడంతో నీటి ఉధృతి పెరిగింది. గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సిరికొండ మండలంలో కప్పల వాగులో భారీ వరద నీరు చేరడంతో కొండూరు గ్రామం జలదిగ్బంధంలో ఉంది. గడ్కోల్‌లోనూ చెరువుకు గండి పడడంతో గడ్కోల్ – తూంపల్లి మధ్య రాకపోకలు నిలిచాయి. సాలూరా మండలం హున్సా, ఖాజాపూర్, మందర్నా గ్రామాల్లో పంటలు పూర్తిగా నీట మునిగాయి.

సాలూర వద్ద మంజీర నది ఉధృతంగా ప్రవహించడంతో అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద ఉన్న వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తున్నాయి. చందూరు మండలంపై ఉన్న లక్ష్మీసాగర్ వాగు పొంగిపొర్లుతోంది. చందూరు-చింతకుంట మధ్య ఉన్న వంతెనపూర్తిగా నీట మునిగింది.

## విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉండడం, వరద ప్రభావం అధికంగా ఉండడంతో శుక్ర, శనివారాల్లో కూడా కామారెడ్డి జిల్లాలో సెలవు ప్రకటిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.


ఇందల్వాయిలో..




లింగంపేటలో..


బాన్సువాడ మండలం కోనాపూర్‌లో..


కామారెడ్డి సమీపంలో ఎన్‌హెచ్44..


ఆర్మూర్‌లో..


అర్సపల్లి వెళ్లే మార్గంలో..


నగరంలోని అరుంధతినగర్‌లో..


నిజామాబాద్ కలెక్టరేట్‌లో..


డిచ్ పల్లి రైల్వే స్టేషన్‌లో..


వరదను పరిశీలిస్తున్న అధికారులు


ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు


గడ్కోల్‌లో..


బాన్సువాడలో..


గౌతంనగర్‌లో..


గౌతంనగర్‌లో..


జన్మభూమి రోడ్డులో..


ఖానాపూర్ కాలూర్ మార్గంలో..


కప్పలవాగు ఉధృతి


బాల్కొండలో లారీ డ్రైవర్లకు ఆహారం అందజేత


నగరంలోని న్యాల్‌కల్ రోడ్డు


పాల్వంచ వాగు..


పిట్లంలో..


పోచారం డ్యామ్


నగరంలోని వినాయక్‌నగర్‌లో..


కామారెడ్డిలో..


అచ్చంపేట గ్రామంలో..


సంగోజీపేట్ వాగు బ్రిడ్జి వద్ద ..


రామడుగు ప్రాజెక్ట్


సిరికొండ మండలంలో..


బాన్సువాడలో..


హంగర్గ గ్రామంలో పర్యటించిన సబ్ కలెక్టర్..


బొగ్గు గుడిసె వద్ద..


తునికిపల్లిలో..


ఇందల్వాయిలో..

## 108 సిబ్బంది సాహసోపేత సేవ



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడలో కురుస్తున్న భారీ వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లు తెగిపోయాయి. మండలంలోని కన్నయ్యతండాకు చెందిన పాల్వంత ప్రసవ వేదనతో బాధపడుతుండగా 108 అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తమై స్పందించారు. వర్షం ఇబ్బందులను అధిగమిస్తూ ఆమెను సురక్షితంగా బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది ఈఎంటీ ప్రసాద్, పైలెట్ శ్రీకాంత్‌లను కుటుంబ సభ్యులు అభినందించారు.

## వర్షా లకు దెబ్బతిన్న పెంకుటిళ్లు



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్షాల దెబ్బతో గ్రామీణ ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలిపోయాయి. బాన్సువాడ మండలంలోని కాద్లాపూర్ గ్రామంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయి. గ్రామానికి చెందిన కాశీభాయ్ అనే మహిళకు చెందిన పెంకుటిల్లు శిథిలావస్థకు చేరుకోవడంతో గురువారం మధ్యాహ్నం కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గ్రామ మాజీ సర్పంచ్ భాస్కర్ ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. కూలిన ఇంటి కారణంగా నిరాశ్రయులైన కుటుంబాన్ని అధికారులు తక్షణమే పునరావాస కేంద్రానికి తరలించారు. గ్రామాల్లో పాడైన ఇళ్లను గుర్తించి ముందస్తు చర్యలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చు ప్రజలు కోరుతున్నారు.

## కోర్టు చౌరస్తాలో నీటిని తొలగించిన మున్సిపల్ సిబ్బంది





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో వర్షం కారణంగా ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. కోర్టు చౌరస్తాలో వర్షం నీరు పూర్తిగా నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సీఐ ప్రసాద్, ఆర్ఐ వినోద్, సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబుకు సమాచారం అందజేశారు. అనంతరం ట్రాఫిక్ క్రేన్ సాయంతో మ్యాన్‌హోల్ ఓపెన్ చేసి నీటిని అందులోకి వెళ్లేట్లుగా చూశారు. రోడ్డుపైన వర్షం నీటిని తొలగించిన ట్రాఫిక్ సిబ్బందిని నగర ప్రజలు అభినందించారు.

## గ్రామస్థులను అప్రమత్తం చేసిన అధికారులు



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూరు మండలం బరంగేడ్గి గ్రామంలో అధికారులు పర్యటించారు. నిజాంసాగర్ ఇన్‌ఫ్లో పెరుగుతున్నందున గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండవద్దని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భోజారావు, ఎంపీడీవో మహబూబ్, సూపరింటెండెంట్ భానుప్రకాష్, నాయబ్ తహశీల్దార్ రవికుమార్, ఆర్ఐ విజయ్ కుమార్, ఇరిగేషన్ ఏఈ గజానంద్, పంచాయతీ కార్యదర్శి గురునాథ్, నాయకులు గోండ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోండ్ల రాజు, కుమ్మరి గంగారాం, దేవానంద్ దేశ్‌ముఖ్, యాదు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుడి కుటుంబాన్ని ఆదుకోవాలి..ఎమ్మెల్సీ కవిత వినతి



**అక్షరటుడే, కామారెడ్డి:** రాజంపేట మండల కేంద్రంలో దేవుని చెరువు కట్ట తెగి వరద ప్రవాహానికి ఇంటిగోడ కూలి యువ వైద్యుడు డా.వినయ్ కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ మేరకు ఎమ్మెల్సీ కవిత గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. గుండారం పల్లె దవాఖాన వైద్యుడు డా.వినయ్ కుమార్ మృతి చెందడం బాధాకరమన్నారు. వరద కారణంగా వైద్యుడి మృతి తనను కలిచివేసిందని పేర్కొన్నారు. వినయ్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని, అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నగరంలో డీసీఎం బీభత్సం.. ఒకరి మృతి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** డీసీఎం వ్యాను ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలో చోటు చేసుకుంది. ఐదో టౌన్ ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయిగల్లి ప్రాంతానికి చెందిన మేస్త్రి పనిచేస్తున్న కిషన్ (42) గాజులపేట్ నుంచి వర్ని చౌరస్తా వైపు నడుచుకుంటూ వస్తున్నాడు. అదే సమయంలో ఆర్ఆర్ చౌరస్తా నుంచి వర్ని చౌరస్తా వైపు వెళ్తున్న డీసీఎం వ్యాను కిషన్‌ను ఒక్కసారిగా ఢీకొంది. ఈ ఘటనలో కిషన్ తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పారిపోవడానికి యత్నించిన డీసీఎం డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులు స్టేషన్‌ను తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఐదో టౌన్ ఎస్‌హెచ్‌వో గంగాధర్ వివరించారు.



# జలవిలయం..





సుంకిని గ్రామానికి దగ్గరలో వచ్చిన నీరు















మహిళను కాపాడుతున్న ఎస్సై ఆంజనేయులు



జాతీయ రహదారిపై..



ఎస్సారెస్పీ కట్టపై పర్యాటకులు



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



నిజాంసాగర్ మండల కేంద్రంలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు




మంజీర బ్రిడ్జిని పరిశీలిస్తున్న కాసుల బాలరాజ్, పోచారం భాస్కర్ రెడ్డి

## వరద సహాయక చర్యలను పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు..

**అక్షరటుడే, నిజాంసాగర్/ఎల్లారెడ్డి:** నియోజకవర్గాల్లో రెండురోజులు కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాలన్ని అతలాకుతలమయ్యాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి దిగువకు వరదను వదిలిపెడ్తున్నారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా.. చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

దీంతో జుక్కల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతారావులు క్షేత్రస్థాయిలో వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు గురువారం ఉదయం నుంచి నిజాంసాగర్ మండలంలో పర్యటించారు. ముంపునకు గురవుతున్న గ్రామాలతో పాటు బొగ్గు గుడిసెను సందర్శించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ భాగం నుంచి భారీ ఇన్‌ఫ్లో ప్రవహిస్తుండడంతో మంజీర ప్రాంతంలోని గ్రామాల గురించి అధికారులతో మాట్లాడారు. నిజాంసాగర్ మండలంతో పాటు జుక్కల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటిస్తూ అధికారులను సమన్వయం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వరద ఉధృతిని తెలుసుకుంటున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయనతోపాటు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు పండరి, తదితరులున్నారు. తీవ్ర వర్షాల కారణంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ ముందుకు వెళ్తున్నారు. విద్యుత్ శాఖ ముఖ్య ఇంజినీర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం బృందాలను వెంటనే రంగంలోకి దింపి విద్యుత్ పునరుద్ధరణ పనులు నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.





నిజాంసాగర్‌లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు..



కామారెడ్డిలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్